

గుమ్మిడి సంధ్యారాణికి

● కీలక బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ● జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ప్రజల విన్నపం

మహిళా శిశు, గిరిజన సంక్షేమం



సాలూరులో మంత్రి సంధ్యారాణి విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, కూటమి కార్యకర్తలు, నాయకులు

పార్వతీపురం, జూన్14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాఖలు కేటాయించారు. ఈ మేరకు శుక్రవారం జాబితాను విడుదల చేశారు. సాలూరు ఎమ్మెల్యే, మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి మహిళా, శిశు సంక్షేమంతో పాటు గిరిజన సంక్షేమ శాఖలను కేటాయించారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఎంతో కీలకమైన శాఖలను సంధ్యారాణికి అప్పగించడంతో జిల్లా ప్రజలు, గిరిజనులు ఆమెపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 'మన్యం'లో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని కోరు తున్నారు. కాగా జిల్లాలో ఆమె పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలివీ..

● ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అనేక గ్రామాలకు పూర్తిస్థాయిలో రహదారులు లేవు. దీంతో వారికి సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. అత్యవసర వేళల్లో డోలీయే దిక్కవుతోంది. కొండ శిఖర గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. విద్య, వైద్యంతో పాటు మౌలిక వసతులకు గిరిపుత్రులు దూరంగానే ఉన్నారు.

● గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. నిధుల లేమితో గత ఐదేళ్ల కాలంలో గిరిజనులకు పూర్తిస్థాయిలో సేవలందించలేకపోయాయి. ట్రైకార్ నిధులు, సబ్సిడీతో కూడిన రుణాలను సైతం అందించలేకపోయాయి. నామమాత్రంగా మారిన ఐటీడీఏలకు పూర్వ వైభవం తేవాల్సి ఉంది.

● గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తరచూ వివిధ కారణాలతో విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయి. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం దీనిపై స్పందించలేదు. జిల్లాలో విద్యార్థుల మరణాల నివారణకు మంత్రి పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పర్యవేక్షణ అవసరం...

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ అవసరం. వాటిపై అధికార యంత్రాంగం సక్రమంగా దృష్టి సారించకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందడం లేదు. దీంతో ఎంతోమంది గిరిజన బిడ్డలు రక్తహీనతతో బాధపడుతున్నారు. పౌష్టికాహార లోపంతో మాతా శిశుమరణాలు కూడా సంభవిస్తున్నాయి. దీనిపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించి ప్రతిఒక్కరికీ పౌష్టికాహారం అందేలా చూడాల్సి ఉంది. మంత్రి సంధ్యారాణికి కేటాయించిన రెండు శాఖల పరిధిలో ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిన్నింటినీ పరిష్కరించి.. జిల్లావాసులకు మెరుగైన పాలన అందించాల్సి ఉంది. అదేవిధంగా నూతన జిల్లా పార్వతీపురం మన్యాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత కూడా ఆమెపైనే ఉంది.

మంత్రికి ఘన స్వాగతం

● సాలూరులో విజయోత్సవ ర్యాలీ

● వర్షాన్ని సైతం లెక్క చేయని ప్రజలు

సాలూరు, జూన్ 14: రాష్ట్ర మంత్రిగా తొలిసారి సాలూరులో అడుగుపెట్టిన గుమ్మిడి సంధ్యారాణికి ఘన స్వాగతం లభించింది. అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. జోరువానను సైతం లెక్కచేయకుండా ఆమె విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. గజమాలతో ఆమెను సత్కరించారు. మహిళలు గొడుగులు వేసుకుని మరీ సంధ్యారాణికి హారతులు ఇచ్చారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు బాణసంచా కాల్చి.. డీజే, డప్పులతో సందడి చేశారు. జనసేన, బీజేపీ శ్రేణులు కూడా ఇందులో భాగస్వాములయ్యాయి. కాగా మంత్రి సంధ్యారాణి శుక్రవారం వేగావతి వంతెన మీదుగా పట్టణంలోకి ప్రవేశించారు. డీలక్స్ సెంటర్ వద్ద కార్యకర్తలతో ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేయించారు. అనంతరం మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్లిన ఆమెకు ప్రజలు జేజేలు పలికారు. గొల్లవీధి వద్ద మహిళలు హారతులు ఇచ్చారు. గజమాలలు, పూలదండలు, బొకేలతో కౌన్సిలర్ సీతమ్మ ఆధ్వర్యంలో శ్రేణులు ఆమెకు అభినందనలు తెలిపాయి. సాలూరు పట్టణ, మండలానికి చెందిన కూటమి శ్రేణులు, ప్రజలకు మంత్రి సంధ్యారాణి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. కాన్వాయ్ ప్రధాన రహదారి గుండా వెళ్తున్నంత సేపు జై చంద్రబాబునాయుడు, జై పవన్‌కల్యాణ్, జై మోదీ అంటూ శ్రేణులు నినాదాలు చేశాయి. మొత్తంగా సాయంత్రం నాలుగు గంటల నుంచి ర్యాలీ రాత్రి పది గంటల వరకు విజయోత్సవ ర్యాలీ కొనసాగింది. అనంతరం మంత్రి ఇంటికి చేరారు. పోలీసులు పట్టణంలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి పూజలు..

సాలూరు రూరల్: రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తొలుత సాలూరు పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త వి.రాజేంద్రప్రసాద్, రుత్వికులు నారాయణాచార్యులు, ఉదయాచార్యులు తదితరులు ఆమెకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. కల్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆమె ఊరేగింపుగా ఇంటికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఇప్పుడెలా?

● గత వైసీపీ సర్కారు తీరుతో ఎఫ్‌పీజీ గ్రూపుల మనుగడ ప్రశ్నార్థకం

● వారి గోడును పట్టించుకోని అధికారులు

● లోన్లు, టార్పాలిన్, ఇతర వ్యవసాయ పరికరాలకు ఎదురు చూపు

● ఏడాదిగా సీసీని నియమించని వైనం

● ఖరీఫ్‌కు ఇబ్బందులు తప్పవంటున్న రైతులు

● కొత్త ప్రభుత్వంపై ఆశలు

జియ్యమ్మవలస: అన్నదాతల శ్రేయస్సే లక్ష్యంగా 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీజీ గ్రూపులు)ను ఏర్పాటు చేసింది. అయితే గత వైసీపీ సర్కారు పాలనలో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వారిని ప్రోత్సహించి ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా తయారు చేసే క్లస్టర్ కోఆర్డినేటర్ (సీసీ)ను చాలాచోట్ల అధికారులు నియమించలేదు. సరికదా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీసీలను వేరే మండలానికి బదిలీ చేయడంతో రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మొత్తంగా గత ఐదేళ్ల కాలంలో ఎఫ్‌పీజీ గ్రూపుల గోడును పట్టించుకునేవారే కరువయ్యారు. నూతన ప్రభుత్వంపైనే వారంతా ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో మొత్తంగా 1,296 ఎఫ్‌పీజీ గ్రూపులు ఉన్నాయి. అయితే జియ్యమ్మవలస మండలం విషయానికొస్తే.. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 210 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయి. వాటిల్లో రెండు వేలకు పైగా అన్నదాతలు సభ్యులుగా ఉన్నారు. వీరు గ్రూపులుగా బ్యాంకుల్లో అకౌంట్లు తెరిచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీర్మానం చేసుకున్న వారు ప్రతి నెలా కొంత మొత్తంలో పొదుపు జమ చేస్తూ వస్తున్నారు. ఇందుకోసం వెలుగు ద్వారా ఒక క్లస్టర్ కోఆర్డినేటర్‌ను నియమించారు. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో వ్యవసాయ అవసరాల నిమిత్తం 69 గ్రూపుల్లో 138 మందికి రూ. 34 లక్షలను రుణం రూపంలో ఇచ్చారు. వీరి నుంచి 2023, జూన్ వరకు రూ. 22 లక్షలు రికవరీ చేశారు. మొత్తంగా 14 గ్రూపులు వారు తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించేశారు. కాగా వారితో పాటు , ఇంతవరకు రుణం పొందని మిగిలిన గ్రూపు సభ్యులు ఈ ఖరీఫ్‌లో లోను కోసం ఎదురు చూస్తున్నారు. ఇకపోతే రుణం కట్టాల్సిన గ్రూపు సభ్యులు ఇంకా ఎంత చెల్లించాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఎఫ్‌పీజీ గ్రూపులను సక్రమంగా నడిపిస్తున్న సీసీ గుల్ల ఈశ్వరమ్మను ఏడాది కిందట ఇక్కడి నుంచి కొమరాడ మండలానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఇప్పటికీ ఎవరిని నియమించలేదు. దీంతో మిగిలిన రూ. 12 లక్షల రికవరీ ప్రశ్నార్థకంగా మారింది. కాగా ఈ ఖరీఫ్ కాలంలో రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు, దుక్కి, దమ్ము సెట్లు, ఇతర వ్యవసాయ పరికరాలు అందని పరిస్థితి ఏర్పడింది. సీసీని నియమించకపోవడం వల్ల మండల వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఇన్‌చార్జి ఏపీఎం, సీసీలు రైతులకు ఏమీ సమాధానం చెప్పలేకపోతున్నారు. నూతన ప్రభుత్వంలోనైనా ఉన్నతాధికారులు సీసీని నియమించి తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



వెలుగు కార్యాలయం

నిలదీస్తున్నారు

జియ్యమ్మవలస మండలంలో ఎఫ్‌పీజీ గ్రూపు రైతులు నిత్యం ప్రతి విషయంలో నిలదీస్తున్నారు. ఏడాది నుంచి సీసీ లేకపోవడం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికా రులకు తెలియజేశాం.

- ఎం.నాగభూషణరావు, ఇన్‌చార్జి ఏపీఎం, జియ్యమ్మవలస మండలం

మెరుగైన ఫలితాలు సాధించాలి

● డీఈవో పగడాలమ్మ

గరుగుబిల్లి, జూన్ 14 : జిల్లాలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో పగడాలమ్మ ఆదేశించారు. శుక్రవారం గరుగుబిల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు బోధన అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిధిలో అందిస్తున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యా ర్థులకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందిం చాలన్నారు. చదువులో వెనుకబడి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. లక్ష్యం మేరకు పాఠశాలల్లో పిల్లలను చేర్పించేం దుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. హెచ్‌ఎం ఎస్‌ఎల్ పాత్రుడు, ఎంఈవో కె.కొండలరావు, ఉపాధ్యాయులు కె.రవీంద్ర, గోవిందరావు, తదితరులున్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో

సాలూరు మున్సిపల్ కమిషనర్‌కు నోటీసు

సాలూరు,జూన్ 14: సాలూరు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణికి శుక్రవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్ షోకాజ్ నోటీసు అందించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ నెల పదో తేదీన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కాగా ఈ సమయంలో సాలూరు మున్సిపల్ కమిషనర్ అని పిలువగా మేనేజర్ రెస్పాండ్ అయ్యారు. కమిషనర్ ఇంకా రాలేదని మేనేజర్ చెప్పడంతో కలెక్టర్ మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే సాలూరు మున్సిపల్ కమిషనర్‌కు నోటీసు ఇచ్చినట్లుగా సిబ్బంది చెబుతున్నారు.

గాలీవాన బీభత్సం

● జిల్లాలో ఏకధాటిగా కురిసిన వర్షం

● ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

● నిలిచిన విద్యుత్ సరఫరా

● పిడుగులకు జనం బెంబేలు

● చల్లబడిన వాతావరణం

● ఎండ వేడి, ఉక్కపోత నుంచి ఊరట చెందిన జిల్లావాసులు



పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

పార్వతీపురం, జూన్14(ఆంధ్రజ్యోతి)/ పార్వతీపురం రూరల్/ పార్వతీపురం టౌన్/ పాలకొండ/సాలూరు, రూరల్/గరుగుబిల్లి/ మక్కువ: జిల్లాలో శుక్రవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగిపోగా.. పిడుగుపాటుకు పశువులు మృతి చెందాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో వాహన రాకపోకలకు అవస్థలు తప్పలేదు. మధ్యాహ్నం వరకూ ఎండ వేడి, ఉక్కపోత అధికంగా ఉండగా.. ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. పార్వతీపురం, పాలకొండ, సాలూరు, కురుపాంతో పాటు అనేక మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులకు ప్రజలు భయాందోళన చెందారు. మరోవైపు పిడుగులు శబ్దాలకు బెంబేలెత్తిపోయారు. ఇళ్లు వదిలి బయటికి రాలేకపోయారు. ఏదేమైనా సుమారు గంట నుంచి రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవగా.. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీంతో జిల్లా వాసులు ఎండ వేడి నుంచి కాస్త ఊరట చెందారు. మరోవైపు రైతులు ఖరీఫ్ సాగుకు సంబంధించి వ్యవసాయ పనుల్లో నిగమ్నమయ్యారు. వరి నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు. కాగా శనివారం కూడా జిల్లాలో పిడుగులతో వర్షం కురిసే అవ కాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.



పార్వతీపురం మండలం సూడిగాంలో పిడుగు పాటుకు కాలిపోతున్న కొబ్బరి చెట్టు



మక్కువలో..

వివిధ చోట్ల ఇలా..

● పార్వతీపురం మండలంలో సూడిగాం గ్రామంలోని ఓ కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. దీంతో గ్రామస్థులు హడలిపోయారు. అయితే ఎవరికీ ఏమీ జరగకపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు.


● పాలకొండ పట్టణంలో హోర్డింగ్‌లు, చెట్టుకొమ్మలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు లుంబూరు గ్రామంలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. దీంతో రైతు దుర్గారావు కన్నీరుమున్నీరయ్యాడు.

● మక్కువ మండలం కొయ్యానపేట, కొండ రేజేరు, చెముడు, వెంకట భైరిపురం గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనేక గ్రామాల్లో అంధకారం నెలకొంది.

● సాలూరు పట్టణంలోని దండిగాం రోడ్డులో చెట్టు కూలడంతో రెండిళ్లు దెబ్బతిన్నాయి. హైవేపైనే విద్యుత్ తీగెలు, స్తంభాలు చెట్లు నేలకొరిగాయి. యుద్ధప్రాతిపదికన మున్సిపల్ అధికారులు వాటిని కార్మికులతో తొలగించారు. వాహన రాకపోకలకు వీలు కల్పించారు. కాగా పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు 11 విద్యుత్ స్తంభాలు విరిగినట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈఈ రంగారావు తెలిపారు. శ్యామలాగౌరీపురం వద్ద పిడుగు పడడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కాలిబూడిదైంది. సాలూరు రూరల్, పాచిపెంటలోనూ ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది.



సాలూరు పట్టణ పరిధి దండిగాం రోడ్డులో ఇళ్లపై కూలిన చెట్టు



పిడుగు పాటుకు శ్యామలాగౌరీపురం వద్ద దగ్ధమైన చెట్టు



సాలూరు హైవేపై కూలిన విద్యుత్ స్తంభాలు




పాలకొండ మండలం లుంబూరులో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు



సాలూరు గాంధీనగర్ వద్ద రోడ్డుపై కూలిన చెట్టు

పవర్‌ఫుల్ పాత్రలో...

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'విశ్వంభర'. త్రిషకృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా, విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ శుక్రవారం సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఇందులో ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారని మేకర్స్ తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి డీఓపీ: చోటా. కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.





పరమేశ్వరుని ఆజ్ఞతోనే కన్నప్ప తీశాం

మంచు మోహన్‌బాబు

"కన్నప్ప కథ అన్ని తరాలను ఆకట్టుకుంటుంది. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే 'కన్నప్ప' చిత్రం తీశాం. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కృష్ణంరాజు గారు మేం అడగ్గానే ఇచ్చి, ప్రోత్సహించారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఉన్నాయి' అని మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ '2014లో 'కన్నప్ప' సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను. అంతా సిద్ధం చేసి పెట్టుకున్నాను. ఇప్పుడు సినిమా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం. కన్నప్పది కల్పిత గాథ కాదు. రెండో శతాబ్దంలో జరిగిన ఘటన. శంకరాచార్యుల వారు కూడా కన్నప్ప గురించి చెప్పారు. 14వ శతాబ్దంలో ధూర్జటి కన్నప్ప గురించి రాశారు. 18వ శతాబ్దంలో కన్నప్ప గురించి బ్రిటీషర్లు రాసిన పుస్తకం బికనీర్ యూనివర్శిటీలో ఉంది. దాని ఆధారంగానే జాగ్రత్తగా సినిమా తీశాం. ఇకపై ప్రతి సోమవారం కన్నప్ప చిత్రం నుంచి అప్డేట్ వస్తుంది. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ధైర్యంగా ముందుకెళ్లాం' అని చెప్పారు.

జైలు నుంచి హేమ విడుదల



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్టయి పరప్పన అగ్రహార జైలులో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న సినీ నటి హేమ శుక్రవారం విడుదలయ్యారు. బుధవారం ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం బెయిల్‌లో సూచించిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి ప్రక్రియ సాగింది. శుక్రవారం అన్ని షరతులకు లోబడి పత్రాలు సమర్పించడంతో హేమను విడుదల చేశారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/TmE38l7లో చదవండి.

ఊరి గొడవల్లో కుర్రోళ్ల మజా



సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. నిహారికా కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. యదువంశీ దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం హీరో నితిన్ ఈ చిత్రం టీజర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఊరి గొడవల్లో తలదూర్చిన యువబృందం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది అనే నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలయికగా సాగిన టీజర్ ఆసక్తికరంగా అనిపించింది. సాయికుమార్ కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్. సినిమాటోగ్రఫీ: రాజు ఎదురోలు



నా కోరిక తీరింది

చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీకి బాల శేఖరుని దర్శకత్వం వహించగా, కే.కే.ఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చైతన్య రావు మాట్లాడుతూ "ప్రతి నటుడికీ అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. ఈ సినిమా ద్వారా నాకు ఆ కోరిక తీరింది" అని అన్నారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి సినిమా కనెక్ట్ అవుతుంది" అని దర్శకుడు బాలశేఖరుని చెప్పారు. "థియేటర్స్‌లో ప్రేక్షకులని ఆకట్టుకునేది కంటెంట్ మాత్రమే. ఆ మంచి కంటెంట్ ఇందులో ఉంది" అని హెబ్బా పటేల్ అన్నారు.

నిమ్స్‌లో పీహెచ్‌డీ

దిక్సూచి DIKSUCHI



హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 26 సీట్లు ఉన్నాయి. నిమ్స్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇది మూడేళ్ల వ్యవధిగల ఫుల్ టైం ప్రోగ్రామ్. గరిష్ఠంగా ఆరు ఏళ్లలో పూర్తిచేయవచ్చు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో మూడేళ్లు పొడిగించే వీలుంది. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు; పబ్లిక్ సెక్టార్ సంస్థలు/యూనివర్సిటీలు/ఇతర ఇన్‌స్టిట్యూషన్‌లకు చెందిన ఉద్యోగులు అడ్మిషన్ నాటికి సంబంధిత సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి. ప్రోగ్రామ్ సమయంలో ఇతర డిగ్రీలు/డిప్లొమాలు చేసేందుకు అనుమతించరు.

విభాగాలు-సీట్లు: బయోకెమిస్ట్రీ 3, క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరపిటిక్స్ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, మెడికల్ జెనెటిక్స్ 4, మెడికల్ అంకాలజీ 2, మైక్రోబయాలజీ 5, న్యూరాలజీ 1, నెఫ్రాలజీ 6, పాథాలజీ 1, ఫిజియోథెరపీ 2.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(లైఫ్ సైన్సెస్/అలైడ్ మెడికల్ సైన్సెస్) ఉత్తీర్ణులు; కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతోపాటు రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; ఎన్ఎంసీ/డీఎన్‌బీ నుంచి ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణులు; ఎంటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/డేటా సైన్స్/మెషిన్ లెర్నింగ్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, ఇన్‌స్పైయిర్ ఫెలోషిప్ అర్హతల్లో ఒకటి ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, బయో స్టాటిస్టిక్స్, ఎథిక్స్ అంశాల నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇది అన్ని విభాగాల వారికి కామన్‌గా ఉంటుంది. రెండో పార్ట్‌లో అభ్యర్థులు హ్యూమన్ అనాటమీ, హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, సెల్ బయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మకాలజీ విభాగాల నుంచి మూడింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎంచుకొన్న విభాగాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. తరవాత మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **మెడికల్ ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.4050
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **నిమ్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 13
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో డిప్లొమా

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ- 'డిప్లొమా ఇన్ ఫిషరీస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు ఉన్నాయి. 75 శాతం సీట్లను కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేకించారు. 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఎస్ఎస్‌సీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ నుంచి 2024 మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్, ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్ అభ్యర్థులు; కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/ మధ్యలో ఆపేసినవారు కూడా అర్హులే. ఇంటర్/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తుకు అనర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** apfu.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/c2lwxdNలో చదవండి.

ఎయిమ్స్ రిషికేశ్‌లో ఎమ్మెస్సీ

రిషికేశ్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)-ఎమ్మెస్సీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- మెడికల్ బయోకెమిస్ట్రీ 7, మెడికల్ ఫిజియాలజీ 2, మెడికల్ ఫార్మకాలజీ 2, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2 సీట్లు ఉన్నాయి.
- మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు బీఎస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఫార్మసీ/నాలుగున్నరేళ్ల బీపీటీ/మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి.

రిటెన్ టెస్ట్: పరీక్ష సమయం మూడు గంటలు. అభ్యర్థి ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 200. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం పర్సెంటైల్ రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులకు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ(డీఓఏటీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో కంప్యూటర్ నాలెడ్జ్, మేథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలకు సంబంధించి మొత్తం 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 30. నెగెటివ్ మార్కులు లేవు. మోడల్ ప్రశ్న పత్రాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

నీలిట్‌లో ఎంటెక్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)-ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 18 సీట్లు ఉన్నాయి. ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ స్కీం కింద సంస్థ స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీ) కోడ్ పేపర్‌కు నిర్దేశించిన గేట్ సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **కౌన్సెలింగ్:** జూన్ 20
- **వెబ్‌సైట్:** nielit.gov.in

జాబ్ కార్నర్

ఎస్‌బీఐలో ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్... రెగ్యులర్ ప్రాతిపదికన ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 (150) భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏదైనా విభాగంలో డిగ్రీ, ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

పోస్టింగ్: హైదరాబాద్, కోల్‌కతా
దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27
వెబ్‌సైట్: https://sbi.co.in/

ఎన్ఎఫ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్... అడ్‌హక్ ప్రాతిపదికన 3 జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు
ఇంటర్వ్యూ తేదీ: జూన్ 24
వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://nfc.gov.in/

యుద్ధ ప్రాతిపదికన గ్రంథాలయం పనులు

● ఎమ్మెల్యే బేబీనాయన ఆదేశం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గ్రంథాలయం కోసం కేటాయించిన పాత మున్సిపల్ పాఠశాల భవనానికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి అప్పగించాలని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మితో కలిసి గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ భవనానికి రూ.6.20 లక్షలు మంజూరు చేశామని, టెండరు ఖరారైందని తెలిపారు. లైబ్రరీకి సొంత భవనం లేకపోవడంతో చాలా కాలంగా తన ఇంట్లోనే నిర్వహిస్తున్నామని లైబ్రేరియన్ స్వర్ణకుమారి తెలిపారు. దీనిపై బేబీనాయన స్పందిస్తూ రాజా కళాశాల కరస్పాండెంట్ అయిన మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావుకు ఫోన్ చేసి లైబ్రరీ నిర్వహణ కోసం మూడు నెలల పాటు కళాశాలలో గాని, సంస్థానం ఉన్నత పాఠశాలలో గాని తాత్కాలిక వసతి కల్పించాలని కోరారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, కౌన్సిలరు వెలగాడ హైమావతి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రతి బహూకరణ

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)కు రోటరీక్లబ్, కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జేసీ రాజు శుక్రవారం భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహూకరించారు. బొబ్బిలి కోటకు విచ్చేసి ఈ పుస్తకాన్ని బేబీనాయనకు అందజేశారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రాజ్యాంగ ముసాయిదా కమిటీలో బొబ్బిలి సంస్థానాధీశులైన తమ తాత ఆర్ఎస్ఆర్‌కె రంగారావు (మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రి) సేవలందించడం తమకెంతో గర్వకారణమన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి డేవిడ్ విక్టర్, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోండ్రు పర్యటన

రాజాం: తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన కోండ్రు మురళీమోహన్ శనివారం రాజాం మండలంలో పర్యటిస్తారని పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటలకు చీపురుపల్లి రోడ్డులోని గాయిత్రీ కాలనీ చర్చ్ ఎదురుగా ప్రైవేటు స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు 10.30 గంటలకు రూరల్ మండలం శ్యాంపురం సచివాలయంలో వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

బాడంగి: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే 5 కీలక సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నారని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు ఎస్టీ ఎరుకుల, గిరిజన తెగల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విజయనగరం రింగురోడ్డు: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లోని రెడ్‌క్రాస్ భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 38 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరికి ప్రశంసా పత్రాలను అందించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు, ప్రతినిధులు కె.సత్యం, టి.రామారావు, ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ వేణుగోపాలరెడ్డి, పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన నేతకు సత్కారం..

విజయనగరం (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి చెందిన జనసేన నేత పెద్దింటి మనోజ్‌కుమార్‌కు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విజయనగరం మహారాజా ఆసుపత్రి అధికారులు శుక్రవారం సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మనోజ్‌కుమార్‌ను స్థానిక యూత్ ప్రతినిధులు అభినందించారు.

రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్‌గా మణికుమార్

విజయనగరం క్రైం: రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్‌గా బి.మణికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రవాణాశాఖ కార్యా లయంలో సేవలను మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

విజయనగరం దాసన్నపేట: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. ప్రజాతీర్పును గౌరవించాలని.. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా పరిషత్ ఛైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ధర్మపురిలోని ఆయన నివాసంలో సాలూరు నియోజకవర్గం మెంటాడ మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో సమావేశమయ్యారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రత్నాకర్, ఎంపీపీ సన్యాసినాయుడు, ఈశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో అక్రమాలను అరికట్టాలి

విజయనగరం రింగురోడ్డు: వాణిజ్యపన్నుల శాఖలో అక్రమాలను అరికడితే.. రాష్ట్రానికి అప్పులు చేయాల్సిన అవసరం ఉండదని ఆ శాఖ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షురాలు హలికాన రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శాఖను కొంత మంది ఉన్నతాధికారులు తమ అరాచక విధానాలతో భ్రష్టు పట్టించారన్నారు. ఈ శాఖను గెద్దల నుంచి రక్షించాలంటే ప్రక్షాళన అత్యవసరమని అన్నారు. ఇదే అంశం పై ప్రభుత్వాన్ని ఏపీ వాణిజ్యపన్నుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం డిపో పరిసర ప్రాంత ప్రయాణికుల సమస్యల కోసం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మేనేజరు కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 99592 25620 నెంబరుకు ఫోన్ చేసి డిపో పరిధిలో గల ప్రయాణికులు తమ సమస్యలను, సందేహాలను తెలియజేయాలన్నారు.

రేపు విష్ణు సహస్రనామ పారాయణం

విజయనగరం రూరల్: దశ హర దశమిని పురస్కరించుకుని ఈ నెల 16న కానుకుర్తివారి సత్తర్వులో సాయంత్రం ఆరు గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతుందని సత్తర్వు ప్రతినిధి జి. రఘోత్తమ ఆచార్య చెప్పారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని మృదంగ విద్వాంసుడు, సత్తర్వు ప్రతినిధి డాక్టరు మండ పాక రవితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు పారాయణాలకు సంబంధించిన పుస్తకాలు తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు సెల్‌నెంబరు 94419 09321ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ నేతల సంబరాలు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు సంబరాలు జరుపుకుంటున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడాన్ని స్వాగతిస్తున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విజయోత్సవాలు నిర్వహించడంతో పాటు కూటమి ఎమ్మెల్యేలను నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు అభినందించారు.



విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును అభినందిస్తున్న ప్రసాదుల రామకృష్ణ, కనకమహాలక్ష్మి



బొబ్బిలి: లబ్ధిదారుకు స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



రేగిడి: దేవుదళలో సంబరాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు



విజయనగరం రూరల్: చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

కక్షపూరితంగానే నాపై అనర్హత వేటు

● తాజా మాజీ ఎమ్మెల్సీ రఘురాజు



విజయనగరం(ఆంధ్రజ్యోతి), జూన్ 14: వైసీపీ కోసం తాను అహర్నిశలు శ్రమించానని, శృంగవరపుకోట ఎమ్మెల్యే టిక్కెట్ తనకి దక్కకపోయినా.. పార్టీ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేశానని తాజా మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం ఆయన విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ శాసనమండలి ఛైర్మన్ మోషన్ రాజు తనకు షెడ్యూల్ 10 కింద నోటీసు ఇచ్చారన్నారు. తాను ఏనాడూ అనా టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కానీ, పార్టీ ని కాని విమర్శించలేదన్నారు. అలాగే పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో కూడా పాల్గొనలేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు చేయూతతో పాలు పలు పథకాలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నానని గుర్తు చేశారు. శృంగవరపు కోటలో ఒక స్కూల్‌లో నిర్వహించే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హాజరయ్యారని, అదే కార్యక్రమానికి తనను కూడా నిర్వాహకులు ఆహ్వానిస్తే వెళ్లానని, ఇందులో తప్పేముందని అన్నారు. స్కూ ల్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తో కలిసి పాల్గొన్నానంటూ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఫిర్యాదు మేరకు మోషన్‌రాజు తనకు నోటీసు జారీ చేశారన్నారు. ఈ నోటీసుపై తాను లేఖ రాశానన్నారు. స్వయంగా హాజరుకావాలని ఛైర్మన్ తేదీలు ఇచ్చారని, గ్రామదేవత పండుగ నేపథ్యంలో హాజరుకాలేనని చెప్పానన్నారు. మరో తేదీ ఇవ్వగా.. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో డాక్టర్ల సూచనల మేరకు అత్యవసరంగా ఆపరేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈలోగానే తన సతీమణితో పాటు, కొంత మంది వైసీపీని వీడి.. ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా టీడీపీలో చేరారన్నారు. ఈ విషయం కూడా తనకు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారన్నారు. ప్రజాస్వామ్యదేశంలో ఎవరి అభిప్రాయాలు, వారికి ఉంటాయని రఘురాజు తెలిపారు. మోషన్‌రాజు జూన్ నెల 3న తన శాసనమండలి సభ్యత్వంపై అనర్హత వేటు వేశారన్నారు. పార్టీకి, పార్టీ అధ్యక్షుడికి తాను విధేయుడిగా ఉన్నా కక్ష పూరితంగా తనపై అనర్హత వేటు వేయడం అన్యాయమన్నారు. దీనిపై తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించానన్నారు.

'జేఎస్‌ఎల్'పై చర్యలు తీసుకోవాలి



కొత్తవలసలో మాట్లాడుతున్న కార్మిక జేఏసీ నాయకులు

కొత్తవలస: జేఎస్‌ఎల్ కర్మాగారం యాజమాన్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. జిందాల్ నగర్‌లో నున్న జేఎస్‌ఎల్ కర్మాగారానికి యాజమాన్యం అక్రమ లాకౌట్ విధించడంపై మూడు కార్మికసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు కార్మిక జేఏసీ ప్రతినిధులు, కార్మికులు శుక్రవారం జేఎస్‌ఎల్ కర్మాగారం మెయిన్ గేట్ నుంచి కొత్తవలస జంక్షన్‌వరకు పాద యాత్ర చేశారు. అనంతరం కొత్తవలస జంక్షన్‌లో రాస్తారోకో, మానవహారాన్ని నిర్వహించారు. దీంతో కొత్తవలస జంక్షన్‌లో ట్రాఫిక్ స్తంభించింది. తమ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లడం కోసమే మానవహారం చేసినట్టు కార్మికులు తెలిపారు జేఏసీ నాయకులు నెక్కలనాయుడుబాబు, పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావుతో పాటు రాష్ట్రఫెర్రోక్రోమ్ పరిశ్రమల కార్మిక సంఘాల నాయకుడు టీవీ రమణ మాట్లాడుతూ జేఎస్‌ఎల్ యాజమాన్యం కనీసం కార్మిక శాఖ అధికారులకు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా లాకౌట్ విధించిందని ఆరోపించారు. అక్రమంగా లాకౌట్ విధించిన యాజమాన్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు కార్మిక సంఘాలకు చెందిన 300 మంది కార్మికులు పాల్గొన్నారు.

పశువధను నివారించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సంఘ నాయకులు

కలెక్టరేట్: బక్రీద్ పండగ సందర్భంగా అక్రమంగా పశువధ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అక్రమంగా పశు రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సత్యనారాయణ, చేళ్ళ రాజకుమారి, సోంబాబు, రెడ్డిపల్లి శంకర్, రూపావతి పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

రాజాం రూరల్: ఈనెల 29న స్థానిక కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ న్యాయాధికారి సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు. కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ సాయితేజ, బార్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. లోక్ అదాలత్ ద్వారా రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చని జడ్జి స్పష్టం చేశారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కోనేరు ఆక్రమణల పరిశీలన



కోనేరు స్థలంలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో చరిత్రాత్మకమైన గుర్రపు కోనేరు ఆక్రమణ పర్వంపై అధికారులు ఎట్టకేలకు రంగంలోకి దిగారు. 'కోనేరుపై కన్నేశారు' అనే శీర్షికన ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో శుక్రవారం కోనేరు ఆక్రమణ ప్రాంతాన్ని పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో సర్వే చేయించారు. సర్వే నెంబరు 189/2లో ఈ కోనేరు ఉంది. కోనేరు గట్టులో చాలా వరకు యంత్రాలతో తవ్వేసినట్లు గుర్తించామని ఆర్ఐ కళ్యాణచక్రవర్తి తెలిపారు. దీనికి సంబంధించిన తమ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, తదుపరి ఉత్తర్వుల మేరకు అవసరమైన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

కొలతల ప్రాప్తికి పనులు చేపట్టాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజాం: కొలతల ప్రాప్తికి పనులు చేపడితే కూలి గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఒమ్మి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. తప్పుడు మస్తర్లు వేస్తే ఫీల్డ్ ఆఫీసరుపై చర్యలు తీసుకుంటామన్నారు. వేతనదారులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఆయనతో పాటు ఏపీఓ సాయిరాం ఉన్నారు.

మంత్రివర్గంలో చోటు కల్పించాలి

● జిల్లా కాళింగ సంక్షేమ సేవా సంఘ అధ్యక్షుడు పేడాడ

కలెక్టరేట్: కాళింగులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని జిల్లా కాళింగ సంక్షేమ సేవా సంఘ అధ్యక్షులు పేడాడ జనార్దనరావు కోరారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గం నుంచి శాసన సభ్యునిగా విజయం సాధించిన కూన రవికుమార్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నామని అన్నారు. శుక్రవారం సంఘ నాయకులతో కలసి ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూన రవికుమార్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం వెలితిగా ఉందన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై భారీ మెజార్టీతో గెలిచి మంచి పేరు తెచ్చుకున్నారని జనార్దనరావు గుర్తు చేశారు. కాళింగులకు న్యాయం జరగాలంటే సీఎం చంద్రబాబు నాయుడు పునరాలోచన చేసి కూన రవికుమార్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పూజారి భాస్కరరావు, ఉపాధ్యక్షులు కె.మురళీధర్, సీపాన వెంకటరావు, తిర్లంగి రాంబాబు, మెట్ట రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛంద, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని వక్తలు అన్నారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన దాతలను సత్కరించారు.



ఎస్.కోట: రక్తదాతలను సత్కరిస్తున్న దృశ్యం



రేగిడి: సంకిలి సుగర్స్‌లో రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న దృశ్యం



విజయనగరం దాసన్నపేట: రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రామారావు (ఫైల్)

గంట్యాడ: నరవ గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదమజ్జిపాలెం గ్రామానికి చెందిన కొంచాడ రామారావు (23) మృతి చెందారు. దీనికి సంబంధించిన స్థానికులు అందించిన వివరాల మేరకు... రామారావు విజయనగరం నుంచి ద్విచక్ర వాహనంపై పెదమజ్జిపాలెం గ్రామం వైపు వస్తుండగా... నరవ వద్దకు వచ్చేసరికి ఎదురుగా తాటిపూడి నుంచి రామవరం వెళ్తున్న ఆటోన ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామారావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అందిన సమాచారం మేరకు విజయనగరం రూరల్ సిఐ శ్రీనివాసరావు, గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామారావు మృతితో పెదమజ్జిపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కొంచాడ సత్యనారాయణ, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రామారావు ఇంటర్ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. రెండో కుమారుడు దిలీప్ బిటెక్ చదువుతున్నాడు. అందివచ్చిన కుమారుడు రామారావు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు..



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

గజపతినగరం: స్థానిక జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వ్యాపారి ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకర్ల సమావేశంలో చోరీకి సంబంధించిన విషయాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గజపతినగరం పట్టణానికి చెందిన గుప్తా తిరుపతిరావు ఈనెల 7న కుటుంబ సభ్యులతో పూరీ వెళ్లారు. ఇళ్లు, వ్యాపారం చూసుకోవాలంటూ తన మేనమామకు తాళాలు ఇచ్చారు. 8 న ఉదయం తన మేనమామ షాపునకు వెళ్లి... రాత్రి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తీసి ఉన్నాయి. బీరువా కూడా తీసి ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో పూసపాటిరేగకు చెందిన పిల్లా సత్తిబాబు చోరీకి పాల్పడినట్టు తేలింది. నిందితుడిని మదుపాడ గ్రామం వద్ద అదుపులోకి తీసుకుని 4.5 తులాల బంగారం, రూ.80వేల నగదు రికవరీ చేశారు. ఏఎస్ఐ గోపితో పాటు రాంబాబు, సత్యనారాయణ, దామోదరరావు ఒక టీమ్‌గా ఏర్పడి ఈ కేసును దర్యాప్తు చేశారు. సీఎస్‌వీ ప్రభాకరరావు, ఎస్ఐ యు.మహేష్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



ఆటోలో గంజాయితో ఉన్న బ్యాగులు

గంట్యాడ: కొటారుబిల్లి కూడలి సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆటోలో ఉన్న గంజాయిని శుక్రవారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉదయం గంట్యాడకు చెందిన డి.ప్రసాద్, కొటారుబిల్లి కూడలికి చెందిన దుర్గారావు కలిసి మార్నింగ్ వాక్ దగ్గరలో ఉన్న అవుట్‌లోకి వెళ్లారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వచ్చే సరికి ఒక ఆటోలో నలుగురు వ్యక్తులు ఉన్నారు. వాకింగ్‌క వెళ్లిన వారు ఆరా తీయగా.. ఆటోలో నాలుగు బ్యాగులను విడిచి పెట్టి ఆ వ్యక్తులు పరుగులు తీశారు. బ్యాగులను పరిశీలించగా గంజాయి ఉన్నట్లు గుర్తించా రు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆటోను, బ్యాగులను స్టేషన్‌కు తరలించారు. ఈ నాలుగు బ్యాగులలో 48 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

స్కూటీ చోరీ..

కొత్తవలస: దెందేరు గ్రామానికి చెందిన నారపురెడ్డి రాము తన స్కూటీ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వి.చంద్రశేఖరరావు కథనం మేరకు ఈ నెల 11న రాము తన మేనమామకు చెందిన స్కూటీపై గులివిందాడ గ్రామంలో జరిగిన పండగకి వెళ్లి తిరిగి రాత్రి 11 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఇంటి ముందు వాహనాన్ని పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం స్కూటీ కనిపించకపోవడంతో గురువారం రాత్రి తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

హైస్కూళ్లకు కిట్లు సరఫరా

రేగిడి: స్థానిక హైస్కూల్ స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని అన్ని హైస్కూళ్లకు శుక్రవారం కిట్లు సరఫరా చేసినట్లు ఎంఈఓలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య తెలిపారు. ప్రస్తుతం పాఠ్యపుస్తకాలు, బెల్టులు, ఇతర సామగ్రి సరఫరా చేశారు. పంపిణీ కార్యక్రమంలో రేగిడి హెచ్ఎం లక్ష్మణరావు, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్‌ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చరిత్రాత్మక నిర్ణయం

కొత్తవలస: రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తిక్కాన చినదేముడు, విశాఖ పార్లమెంటరీ ని యోజకవర్గ బీసీసెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు అన్నారు. శుక్రవారం వీరు కొత్తవలసలోని టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతుల భూములను కాజేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా కోర్టు విధులను బహిష్కరించి నిరసనలు చేసినట్టు గుర్తు చేశారు. సీఎంగా అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టాన్ని రద్దు చేస్తానని ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారని ప్రశంసించారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు

కలెక్టరేట్: తాటిపూడి బాలికల గురుకుల పాఠశాలలో ఇంగ్లీషు, గణితం, ఫిజికల్ సైన్సు పోస్టులకు గెస్ట్ టీచర్లుగా బోధించేదుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ అర్హత కల్గిన అభ్యర్థులు ఈనెల 18 వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా దరఖాస్తు అందజేయాలని కోరారు.



సుధారాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీలర్లు

డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

శృంగవరపుకోట రూరల్: డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల డీలర్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజును శుక్రవారం కోరారు. ఎంతో కాలంగా డీలర్ల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. దీనిపై సుధారాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, డీలర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు చిత్తశుద్ధితో సేవలు

జామి: జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారికి సేవలందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ అన్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కంది వెంకటరమణను కుమారాంలోని ఆయన నివాసం వద్ద ఉద్యోగ సంఘాల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కంది వెంకటరమణను అభినందిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

లాభదాయక విధానాలు అనుసరించాలి

పార్వతీపురం రూరల్: రైతులు లాభదాయక విధానాలు అనుసరించాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు అన్నారు. దోకిశీల గ్రామంలో మండల న్యాయసేవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు సంబంధిత చట్టాలపై అవగాహన పొందాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో నాణ్యత చూడాలని, సంబంధిత బిల్లులు జాగ్రత్త పర్చాలని ఆయన సూచించారు. అనంతరం పలువురు రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ కమిటీ సభ్యులు టి.జోగారావు, ఐటీడీఏ పీఏవో జి.శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి ఎం.అశోక్ పాల్గొన్నారు.

సీతంపేట ఐటీడీఏలో 85 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో 85 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర తెలిపారు. అసిస్టెంట్ మ్యాథ్స్ 13, ఫిజికల్ సైన్స్ పది, సోషల్ ఐదు, నాచురల్ సైన్స్ 12, ఇంగ్లీష్ 12 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఎస్‌జీటీ 33 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి నివేదికను ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులను నియమిస్తామని తెలిపారు.

జీవో నెం.3ను పునరుద్ధరించండి

కురుపాం: డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడక ముందే జీవో నెంబరు 3ని పునరుద్ధరిస్తే ఆదివాసీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపయోగపడుతుందని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్నిక నేపథ్యంలో సీఎం చంద్రబాబు జీవో నెంబరు 3ని పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడం చాలా ఆనందదాయకం అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టడం సంతోషం అన్నారు. ప్రభుత్వం జీవో నెంబరు 3ను పునరుద్ధరించి ఆదివాసీ కలను నెరవేర్చాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

● జూనియర్ సివిల్ న్యాయాధికారి విజయరాజ్‌కుమార్

పాలకొండ: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని పాలకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా లుంబూరు గ్రామంలో సాలిడ్ వేస్ట్ మెటీరియల్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించి, ఎరువుల తయారు చేసి రైతులకు విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ, పి.మునిస్వామి, ఎం.జగన్మోహన్‌రావు, బి.రామ్మోహన్‌రావు, ఎం.వెంకటేశ్వరరావు, రైతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

వీరఘట్టం: మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. కొన్ని గ్రామాల్లో మలేరియా జ్వరాలు కూడా సోకడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం గంగంపేట గ్రామంలో ఇంటింటికి వెళ్లి దోమల నివారణా మందులు పిచికారీ చేశారు. దోమ తెరలు వినియోగించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ యూనిట్ అధికారి ఎం.మోహన్‌రావు, బిటివాడ పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో శ్రీనివాస్, చినబాబు, హెల్త్‌అసిస్టెంట్లు తిరుమల, పోలినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

గరుగుబిల్లి: గ్రామాల్లోని వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల వైద్యాధికారి సంతోష్‌కుమార్ సూచించారు. శివ్వాం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన నాలుగేళ్ల పావనికి కణిత ఆపరేషన్ చేసిన విషయం తెలుసుకుని అవసరమైన సేవలు అందించారు. గ్రామంలో అధికంగా కీళ్ల నొప్పులు కారణంగా వృద్ధులు అవస్థలు పడుతున్నారని, వీరికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచామని చెప్పారు. గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యే వారికి చికిత్సలు అందించారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నామని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు తెలిపారు. మండలంలోని రావివలస, మరుపెంట, సొంబన్నవలసలో నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మురుగు తొలగించడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నామని చెప్పారు. పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తమై ప్రజలకు అసౌకర్యం కలగకుండా దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ అప్పడు, కార్యదర్శి రంభ శశికుమార్ పాల్గొన్నారు.

పాచిపెంటలో ఉచిత వైద్య శిబిరం

పాచిపెంట: ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాచిపెంట కమ్యూనిటీ హాల్ వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పాచిపెంటతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన 136 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా, 42 మందికి ఆపరేషన్లు నిమిత్తం విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు ఐఆర్‌డీఎస్ ఎన్‌జీవో సాలూరు చిక్కాల చిన్నమ్ములు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పుష్పగిరి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోసిమానుగూడలో..

భామిని: మండలంలోని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదర్ ఆధ్వర్యంలో కోసిమానుగూడలో ఇంటింటా జ్వరాల సర్వే శుక్రవారం నిర్వహించారు. జ్వరపీడితుల నుంచి రక్తపూతలు సేకరించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించి, ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు.

రక్తదానంపై అపోహలు వీడాలి

పాలకొండ: రక్తదానంపై అపోహలు వీడాలని స్థానిక ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ జి.నాగభూషణ్, వైద్యులు చిరంజీవి, రవీంద్రకుమార్, శివప్రకాష్, సాకేత్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. 30 మంది రక్తదాతలు దానం చేశారు. క్రియా ఆర్గనైజేషన్ నుంచి మురళి, జనసేన పార్టీ తరఫున పొట్నూరు రమేష్, కడగల హరి ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

మా గెలుపు ఘనత మీదే

- ప్రజలకు అందుబాటులో ఉంటాం
- అభివృద్ధి చేసి చూపిస్తాం
- ఎమ్మెల్యేలకు ఘన సత్కారం

జయకృష్ణ, జగదీశ్వరీ

'మా గెలుపు ఘనత మీదే. మీరంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటేయడం వల్లే మేము గెలిచాం. మీకు అండగా ఉంటాం. ఏ సమస్య వచ్చినా తీరుస్తాం. గ్రామాలను అభివృద్ధి చేసి తీరుతాం' అని పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి ప్రజలకు హామీ ఇచ్చారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: విజయచంద్ర



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగురవేసేందుకు కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. జిల్లాకేంద్రం పార్వతీపురంలో శుక్రవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలో జరిగిన విజయోత్సవ సభలో విజయచంద్ర మాట్లాడారు. పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తానని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో నష్టపోయారని వారందరికీ తాము అండగా ఉంటామని చెప్పారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. విజయచంద్రకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. గజమాలలతో, సత్కారాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. విజయోత్సవ సభలో మహిళా కార్యకర్తలు, నాయకులు కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆయా పార్టీల ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అభినందించిన అధికారులు

పార్వతీపురం రూరల్: వెంకంపేట పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఇంటి వద్ద శుక్రవారం అధికారులు హడావుడి కనిపించింది. పురపాలక సంఘం ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు ఎమ్మెల్యేను కలిసి అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. ● నర్సిపురం గ్రామంలో ఎమ్మెల్యే విజయచంద్రకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అమరావతి వెళ్లి తొలిసారిగా నియోజకవర్గానికి రావడంతో నర్సిపురంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా హారుతులు, స్వాగతం పలికారు. అనంతరం స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిధులు సమకూరుస్తా: జయకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

భామిని: నిధులు సమకూర్చి నియోజకవర్గాన్ని అన్ని శాఖల పరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే అయ్యాక మొదటిసారిగా మండలంలోని నులకజోడు ఓ శుభకార్యానికి రాగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. పురవీధుల్లో ర్యాలీ చేసి నృత్యాలు చేశారు. అనంతరం భామినిలో కార్యకర్తలను కలిసి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఐదు కీలక హామీలు చంద్రబాబునాయుడు సంతకాలు చేశారన్నారు. వైసీపీ హయాంలో ఐటీడీఏకు కేటాయించిన నిధులు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. వెనుకబడిన నియోజకవర్గంపై అసెంబ్లీలో లేవనెత్తి బత్తిలిలో మంజూరైన లిఫ్ట్ ఇరిగేషన్, కొండలోవ గెడ్డ రిజర్వాయర్, గిరిజనులకు విద్యాభివృద్ధి, ప్రతి గ్రామానికి తాగునీరు కల్పించడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. తన విజయంపై కూటమి నాయకులు చేసిన కృషికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నిమ్మల నిబ్రం, ఆర్.కిరణ్, జగదీశ్వరరావు, రవినాయుడు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయకృష్ణకు అభినందనలు

వీరఘట్టం: మండలంలోని రాజపురంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను శుక్రవారం పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. వ్యవసాయశాఖ డీఏవో రాబర్ట్‌పాల్, పాలకొండ ఏడీఏ రత్నకుమారి, వీరఘట్టం, సీతంపేట, భామిని ఏవోలు సౌజన్య, శ్రీదేవి, మన్మథరావు, ట్రాన్స్‌కోశాఖ నుంచి అధికారులు, సచివాలయ సిబ్బంది పలువురు అభినందనలు తెలిపారు.

మంత్రి సంధ్యారాణిని కలిసేందుకు వెళ్లిన టీడీపీ శ్రేణులు

మక్కువ: సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి తొలిసారిగా వచ్చిన సందర్భంగా శుక్రవారం టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలి వెళ్లారు. ఆమెకు అభినందనలు తెలియజేశారు.

రుణపడి ఉంటా: జగదీశ్వరీ



ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: కురుపాం నియోజకవర్గంలో టీడీపీ విజయం మీ అందరు ఘనతేనని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కుదమ పంచాయతీలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సన్మాన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్, నియోజకవర్గం నాయకులు, జనసైనికులు, పార్టీ కుటుంబ సభ్యులకు ఆజన్మాంతం రుణపడి ఉంటానని భావోద్వేగానికి లోనయ్యారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పల్ల రాంబాబు,టీడీపీ నాయకులు ఎం.సత్యంనాయుడు, వెంపటాపు భారతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందన

గరుగుబిల్లి: ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని టీడీపీ ప్రతినిధులు శుక్రవారం అభినందించారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మర్రాపు పురుషోత్తం నాయుడు, అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగుర వేయడంలో కార్యకర్తలు కృషి ఎంతగానో ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు ముందుంటారన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో సాలూరు ఎమ్మెల్యే సంధ్యారాణికి ప్రాధాన్యత కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ● **గుమ్మలక్ష్మీపురం:** ఎమ్మెల్యే జగదీశ్వరికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి అభినందనలు వెల్లువ కొనసాగుతుంది. శుక్రవారం పెద్ద సంఖ్యలో ఆమె ఇంటి వద్దకు వచ్చి అభినందనలు తెలిపారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎల్విన్‌పేట, కురుపాం ఎస్ఐలు బిడ్డిక ప్రసాద్, షణ్ముఖరావు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు, ఇంజనీరింగ్‌శాఖ డీఈలు, భద్రగిరి గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు అభినందనలు తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



పాలకొండ: చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం, సాలూరు రూరల్: మామిడిపల్లిలో..

పాలకొండ: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మోజూరు తేజోవతి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం ఐదు సంతకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రారంభించారన్నారు. ఈసందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, సామాజిక పింఛన్లు పెంపు, అన్నా క్యాంటీన్ ఏర్పాటు, నైపుణ్య గణనపై సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట సంగంనాయుడు, కిమిడి బంగారునాయుడు, కరగాన ప్రసాద్, బూరాడ మౌళి, జడ్డు శ్రీను, పొట్నూరు రాంబాబు, మిడితాన హరి, పిట్టా సాయి తదితరులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** సీఎం చంద్రబాబు చిత్రపటానికి మామిడిపల్లిలో శుక్రవారం పాలభిషేకం చేశారు. టీడీపీ నాయకులు డొంక అన్నపూర్ణ, బూస తవుడు, తాడుతూరి శ్రీనివాసరావు, తిరుపతిరావు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేత ముదరక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. లఖనాపురంలో ప్రకృతి విధానాలతో సాగు చేసిన పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీలేని సూత్రాలతో నవ ధాన్యాలను రైతులు సాగు చేసుకోవాలన్నారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. జిల్లాలోని 15 మండలాల్లో ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచుతున్నామని తెలిపారు. అలాగే శ్రీపద్ధతిలో వరి, రాగి పంటలు సాగు చేసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు.గ్రామంలో ముదిలి విజయవాంకుశంతో పాటు పలువురు రైతులు సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, ఎం.అప్పలనాయుడు, మండల ఇన్‌చార్జి వి.పోలినాయుడు, గౌరునాయుడు, రైతులు సత్యనారాయణ, గౌరునాయుడు, పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగుపై అవగాహన ఉండాలి

గుమ్మలక్ష్మీపురం: రైతులు ఉద్యానవన సాగుపై అవగాహన కలిగిఉంటే ఆర్థికంగా బలోపేతం పొందేందుకు అవకాశం ఉంటుందని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్య క్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకొనే పంటలపై దృష్టిపెడతే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మండల హార్టీ కల్చర్ వంగర, కేదారిపురం, నాంద్రుకోన, రెల్ల, దుమ్మంగి, కుక్కిడి, పెదఖర్జా, తాడికొండ, ఇరిడి, లుంబేసు పంచాయతీలకు సంబంధించిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీతానగరంలో విజయచంద్రకు ఘన స్వాగతం

సీతానగరం: మండల కేంద్రానికి తొలిసారి వచ్చిన ఎమ్మెల్యే విజయచంద్రకు శుక్రవారం కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. సాల హరగోపాల్, డి.భానుప్ర సాద్, పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు. ఎస్ఐ పాపారావు బందోబస్తు నిర్వహించారు.



తొలగించిన కార్మికులను చేర్చుకోవాలి

కొమరాడ: పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం నాయకుడు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని అన్నారు. తక్షణమే తొలగించిన బి.సావిత్రమ్మ, డి.సీత, వై.మంగమ్మ, అనులను విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు.



నిరసన చేపట్టిన ఎండీఎం నిర్వాహకులు, సీపీఎం నాయకులు





రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

రాయగడ: రాయగడ-జేకే పూర్ మార్గమధ్యంలో 326 జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ఎన్జీవో సంస్థలో పనిచేస్తున్న యువతీ, యువకుడు మృతిచెందారు. ఈ ఘటనపై చందిలి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హర్ష ట్రస్ట్ అనే ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న యువతి, యువకుడు రాత్రి 8.30 గంటలకు విధులు ముగించుకుని జేకే పూర్ నుంచి స్కూటీపై రాయగడ వస్తుండగా.. బాకురుగుడ ప్రాంతంలో రాయగడ నుంచి జేకే పూర్ వెళ్తున్న ట్యాంకర్ లారీ ఢీ కొంది. దీంతో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్‌ను, సిబ్బందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మృతిచెందిన యువకుడు రాయగడ జిల్లా కళ్యాణసింగుపూర్ సమితి కరప పంచాయతీ పాంద్రపడ గ్రామానికి చెందిన సురేంద్ర మహానందియాగా, యువతి మనీషా జెగారిగా గుర్తించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యాధితో భయాందోళన

ఒడిశా

రాయగడ: కాశీపూర్ సమితి డొంగసిలి పంచాయతీ మనుష్‌పొదర్ గ్రామంలో గుర్తుతెలియని వ్యాధి సోకి ఇప్పటికే ఐదుగురు చిన్నారులు మృతిచెందడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యులు బాధిత గ్రామాలకు చేరుకుని పిల్లలకు టీకాలు వేశారు. వ్యాధి లక్షణాలు వారికి కూడా అంతు పట్టడం లేదు. ఈ వ్యాధికి గురైన మరో ఇద్దరు చిన్నారులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జిల్లా ఆరోగ్య కేంద్రం అధికారి మమతా చౌదరి, కాశీపూర్ ఆరోగ్య కేంద్రం వైద్యులు నేత్రానంద్ నాయక్, అమిత్‌కుమార్ బిసోయ్, రాయగడ నుంచి మైక్రో బయాలజిస్ట్.. గ్రామానికి చేరుకుని వ్యాధి లక్షణాలపై బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు జరుపుతున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు ధైర్యం చెబుతున్నారు.



